సాక్షి పెద్దపల్లి

బుధవారం। 18। జనవరి। 2023



పోటెత్తిన భక్తులు

కొండగట్టు: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ పెరిగింది. హైకోర్టు జడ్జి జస్టిస్ పుల్లా కార్తీక్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు.



కుజదోష నివారణ పూజలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో మంగళవారం అర్చకుల మంత్రోచ్ఛారణలతో కుజదోష నివారణ పూజలు నిర్వహించారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0 /15.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరుగుతుంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

'కంటి వెలుగు' ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి(పెద్దపల్లి): రెండో విడత కంటివెలుగు కార్యక్రమం అమలు, ఏర్పాట్లపై జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు జూలపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా క్యాంపు నిర్వహణ, ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ, కంటి వెలుగు కార్యక్రమంలో అందరూ కంటి పరీక్షలు చేయించుకొని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంపీవో కిరణ్, ఉప సర్పంచ్ మహేశ్, కార్యదర్శి లచ్చయ్య తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌జెండర్లకు ఐడీ కార్డుల అందజేత



ఐడీ కార్డులు అందిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లకు మంగళవారం సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను కలెక్టర్ సంగీత అందజేశారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్ 14 మంది ట్రాన్స్‌జెండర్లకు కార్డులు అందించారు. జిల్లాలో ట్రాన్స్‌జెండర్స్ కోసం ఏర్పాటు చేసిన నేషనల్ పోర్టల్ ఫర్ ట్రాన్స్‌జెండర్స్ ద్వారా 19మంది దరఖాస్తు చేసుకోగా సీడీపీఓ, జిల్లా సంక్షేమశాఖ కార్యాలయం ద్వారా పరిశీలించి అర్హత గల 14మందికి కార్డులు, సర్టిఫికెట్‌లు అందించారు.

సొంతూరికి వెళ్లిన వలస కూలీలు



రైల్వేస్టేషన్‌లో కూలీలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట శివారులోని పీఎస్‌ఆర్ ఇటుకబట్టీలో కూలీలుగా పనిచేస్తున్న ఐదుగురిని కార్మికశాఖ అధికారులు ఒడిశాలోని సొంతూరికి మంగళవారం పంపించారు. బట్టీలో పనిచేసే రింకూ అనే కూలీ ఒడిశా ప్రభుత్వాధికారులకు తమతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ పంపిన వీడియోతో స్థానిక రెవెన్యూ, కార్మిక శాఖ అధికారులు సోమవారం బట్టీవద్ద విచారణ జరిపిన విషయం తెలిసిందే. మంగళవారం కార్మికశాఖ కార్యాలయంలో కార్మికులు, యజమానులతో మాట్లాడారు. తమ బట్టిలో ఆరునెలల పాటు పనిచేసే ఒప్పందంపై వచ్చిన వలస కూలీలు నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ యజమానులు పేర్కొనగా.. కార్మికులు తమ ఊరికి వెళ్లేందుకే సుముఖత చూపడంతో ఐదుగురికి కార్మికశాఖ జూనియర్ అసిస్టెంట్ రాము టికెట్ ఇప్పించి రైలులో పంపించారని కార్మికశాఖ ఇన్‌చార్జి అధికారి రామ్మోహన్ తెలిపారు.

రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత



ర్యాలీలో ఎన్టీపీసీ ఈడీ సునీల్‌కుమార్ తదితరులు

జ్యోతినగర్(రామగుండం): రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని ఎన్టీపీసీ రామగుండం – తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ స్టేజీ–1 ప్రాజెక్టు గేట్ వద్ద రోడ్డు భద్రతా ప్రచార ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలపై ప్రయాణించే సమయంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలు జరుగకుండా నివారించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రాజెక్టులోకి, టౌన్‌షిప్‌నకు వచ్చే వాహనదారులు నియమాలు పాటించాలన్నారు. ఎన్టీపీసీ, బీహెచ్‌ఈఎల్, జీఈ, టీపీఎల్‌కు చెందిన సేఫ్టీ అధికారులు, ఉన్నతాధికారులు, వివిధ కాంట్రాక్టు ఏజెన్సీలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

మురుగు శుద్ధి.. ఏది చిత్తశుద్ధి..!



'ఈ ఫొటో రామగుండం నగరపాలక పరిధి మల్కాపూర్‌లో గతంలో నిర్మించిన సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్(ఎస్‌టీపీ). శ్రీపాద ప్రాజెక్ట్ నిర్మాణంలో సుందిళ్ల బ్యాక్ వాటర్‌తో ముంపునకు గురయింది. ఇందుకు పరిహారంగా రూ.11.25కోట్ల నిధులు కేటాయించాలని, మరోచోట సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మిస్తామని నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ ప్రభుత్వానికి లేఖ రాశారు. కానీ ఇప్పటి వరకు స్పందన రాలేదు. ప్రస్తుతం ప్లాంట్ నిరుపయోగంగా మారింది. నగరంలో రోజూ మురుగునీరు సుమారు 25 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) వరకు గోదావరిలో కలుస్తోంది. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడంతో మురుగునీరంతా గోదావరిలో కలువడంతో కలుషితమవుతోంది'.



రామగుండంలో కొనసాగుతున్న ఎఫ్‌ఎస్‌టీపీ నిర్మాణ పనులు

- జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో వీడని నిర్లక్ష్యం
- రామగుండంలో కొనసాగుతున్న ఎస్‌టీపీ పనులు
- పెద్దపల్లి, మంథనిలో స్థలం గుర్తించినా ఊసేలేని నిర్మాణం
- సుల్తానాబాద్‌లో ఎఫ్‌ఎస్‌టీపీ కేంద్రానికి గుర్తించని స్థలం



మురుగు శుద్ధితో ఎరువుల తయారీకి కొత్తగా నిర్మిస్తున్న ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్

జిల్లాలో..

మున్సిపాలిటీ పేరు	ఎస్టీపీ/ఎఫ్ఎస్టీపీ కెపాసిటీ	పనుల పురోగతి
రామగుండం	60 కేఎల్‌డీ (ఎస్టీపీ)	పనులు కొసాగుతున్నాయి
పెద్దపల్లి	15 కేఎల్‌డీ(ఎఫ్ఎస్టీపీ)	పనులు ప్రారంభం కాలేదు
సుల్తానాబాద్	5 కేఎల్‌డీ(ఎఫ్ఎస్టీపీ)	ఇంకా స్థలాన్ని గుర్తించలేదు
మంథని	5 కేఎల్‌డీ(ఎఫ్ఎస్టీపీ)	పనులు ప్రారంభం కాలేదు

ఎస్టీపీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



"రామగుండంలో రూ.2.86 కోట్ల నిధులతో చేపట్టిన ఎస్టీపీ నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టాం. పనులు త్వరగా పూర్తి చెయ్యాలని కాంట్రాక్టర్‌తో మాట్లాడాం. మురుగుశుద్ధితో ఎరువును తయారు చేసే ఎఫ్‌ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. మరికొన్ని మురుగుశుద్ధి కేంద్రాల ఏర్పాటుకు డీపీఆర్ తయారీకి ఓ సంస్థ కూడా ఇటీవల పరిశీలించింది.

– బి.సుమన్‌రావు, మున్సిపల్ కమిషనర్, రామగుండం

కోల్‌సిటీ(రామగుండం): నదులు, చెరువులు, కాలువల్లోకి మానవ మల వ్యర్థాలు చేరకుండా మురుగుశుద్ధి ప్లాంట్ల(ఎఫ్‌ఎస్‌టీపీ) నిర్మాణంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాయి. ఇందుకు అవసరమైన నిధులు కూడా మంజూరయ్యాయి. కానీ జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఏర్పాటు చెయ్యాల్సిన ఎఫ్‌ఎస్‌టీపీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. రామగుండం కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల్లో ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్లు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఒక్క మున్సిపాలిటీలో కూడా ప్లాంట్ల నిర్మాణం పూర్తి కాలేదు. మురుగుశుద్ధిపై అధికారులు చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

కొనసాగుతున్న పనులు

రామగుండంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) నిర్మాణానికి రూ.2.86కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులు కేటాయించారు. 60 కేఎల్‌డీ (కిలో లీటర్ పర్ డే) కెపాసిటీ కలిగిన ఈ ప్లాంట్ నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. బిల్లుల చెల్లింపు ఆలస్యం కావడంతో ఏడాదిగా పనులు చేపట్టని కాంట్రాక్టర్ ఇటీవలే తిరిగి పనులు చేపట్టి మళ్లీ నిలిపివేశాడు. రామగుండంలో అమృత్ నిధులతో మరికొన్ని కొత్త ఎఫ్‌ఎస్‌టీల నిర్మాణానికి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు(డీపీఆర్)ను ఎన్‌సీపీ సంస్థ రూపొందిస్తోంది. సింగరేణి, ఎన్టీపీసీలు కూడా ప్రత్యేకంగా మురుగు శుద్ధి కేంద్రాలు నిర్మించాయి.

జిల్లాలో తొలిసారి..

రామగుండం పరిధిలో తొలిసారిగా మానవ వ్యర్థాలతో ఎరువులను తయారు చేసే ఎఫ్‌ఎస్‌టీ (ఫికెల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్)ప్లాంట్‌ను నిర్మిస్తున్నారు. నిండిన సెప్టిక్ ట్యాంకులలోని వ్యర్థాలతో ఎరువులు తయారు చేయడం ఈ ప్లాంట్ లక్ష్యం. మల్కాపూర్ శివారులోని స్లాటర్ హౌజ్ సమీపంలో రూ.1.6 కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టారు. ప్లాంట్‌పై పర్యవేక్షణ లేక పనులు నత్తనడకలో సాగుతున్నాయి. ప్లాంట్‌లో బోర్‌వెల్ ఏర్పాటు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిసింది.

పెద్దపల్లి, మంథనిలో..

పెద్దపల్లి, మంథని మున్సిపాల్టీల్లో ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్ల నిర్మాణంపై ఇప్పటి వరకు ఊసేలేదు. పెద్దపల్లిలోని రాఘవపూర్ రోడ్ డంపింగ్‌యార్డ్‌లో 5 కేఎస్‌డీ కెపాసిటీ కలిగిన ప్లాంట్ నిర్మాణానికి స్థలం గుర్తించి కౌన్సిల్ ఆమోదం పొందారు. కానీ పనులు ప్రారంభించలేదు. మంథని మున్సిపాలిటీలో కూడా ఉప్పట్ల రూట్‌లో 5 కేఎల్‌డీ కేపాసిటీ కలిగిన ప్లాంట్ నిర్మాణానికి స్థలం గుర్తించి కౌన్సిల్ తీర్మానం పొంది ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇక్కడ కూడా పనులు ప్రారంభించలేదు. సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 5 కేఎస్‌డీ కెపాసిటీతో ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటి వరకు అనువైన స్థలాన్ని గుర్తించలేదని తెలిసింది.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కోల్పోతున్న మార్కులు

కేంద్ర ప్రభుత్వం ఏటా నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో ఎఫ్‌ఎస్‌టీపీ నిర్వహణకు ఇచ్చే మార్కులు కీలకం కాగా, జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ప్లాంట్‌లు లేక మెరుగైన ర్యాంక్‌లు సాధించలేకపోతున్నాయి. ఓడీఎఫ్ ప్లస్ గుర్తింపుతోనే సరిపెట్టుకుంటున్నాయి. కాగా రామగుండంతోపాటు మూడు మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి (ఎఫ్‌ఎస్‌టీపీ) తీరుపై రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం దృష్టిసారించింది. గత నెల 16న ఎన్‌సీపీఈ సంస్థ ప్రతినిధి రామగుండం, మంథనిలో పర్యటించారు. ఎఫ్‌ఎస్టీపీల నిర్వహణపై వివరాలు సేకరిస్తున్నారు.

రుణం రాక.. మాఫీ కాక..

- రైతుల అవసరాలు తీర్చలేకపోతున్న బ్యాంకులు
- 32 శాతమే పంట రుణాల పంపిణీ
- వానాకాలంలో అరకొర.. రబీపైనే అన్నదాత ఆశలు



జిల్లాలో..

వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం
రూ.1,672.07 కోట్లు

ఇవ్వాలనుకున్న రైతులు
1,55,974

ఇచ్చిన రుణాలు
రూ.549.63 కోట్లు

రుణం తీసుకున్న రైతులు
45,551

సాక్షి, పెద్దపల్లి: పంట రుణాల మంజూరులో బ్యాంకర్లు అలసత్వం వహిస్తున్నారు. ఏటా లక్ష్యానికి దూరంగానే ఉండిపోతున్నారు. వానాకాలం సీజన్‌లో 32శాతమే పూర్తి చేసిన బ్యాంకర్లు, యాసంగిలో అదేతీరున వ్యవహరిస్తున్నారు. యాసంగి సాగు పనులు జోరుగా సాగుతుండగా, అన్నదాతలు పెట్టుబడులకు ఇబ్బందిపడుతున్నారు. పంటలు వేసిన రైతులు పెట్టుబడి కోసం మళ్లీ వడ్డీ వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. అప్పు ఇచ్చిన వ్యాపారులు చేతికొచ్చిన పంటను ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి తమ అప్పులు తీర్చుకుంటున్నారు. మరికొందరు రైతులు అప్పులిచ్చిన వ్యాపారులకే ధాన్యం అమ్ముకొని నష్టపోతున్నారు.

రుణమాఫీ కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వం 2018లో ఎన్నికల సమయంలో రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించి విడతల వారీగా చేపడుతోంది.
- దీంతో అప్పటివరకు జిల్లాలో రూ.498 కోట్లను 89,153 మంది రైతులు రుణం తీసుకున్నారు. రూ.25వేల లోపు రుణాలు గతేడాది మాఫీ చేసింది. దీంతో 14,636 మంది రైతులకు రూ.36.39 కోట్లు రుణమాఫీ చేసింది.
- తదుపరి రూ.50 వేలలోపు రుణాలను మాఫీ చేస్తున్నట్లు గతేడాది బడ్జెట్ సమయంలో ప్రకటించారు. సదరు రుణ బాధితులు 1,7052 మంది ఉండగా, వారి రుణం రూ.85.25కోట్లు మాఫీ కావాల్సి ఉంది.
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కేవలం 11,200 మందికి రూ.53.09 కోట్ల విలువగల చెక్కులు అందజేశారు. మిగితావారు మాఫీ అమలుకు నిరీక్షిస్తూ బ్యాంకుల్లో పంట రుణాలు పొందేందుకు ముందుకురావడం లేదు.
- పాతబాకీ రుణం రూ.లక్ష చెల్లించి తిరిగి తీసుకుంటే మాఫీ వర్తించదన్న అపోహతో రూ.లక్ష రుణం పొందిన రైతులు పంట రుణాలు పొందేందుకు ఆసక్తి చూపడం లేదు. అవసరమైన వారు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.
- బ్యాంకుల్లో తీసుకునే పంట రుణాలకు పావలా వడ్డీ వర్తింపజేయడంతో సకాలంలో చెల్లించినవారిపై భారం తక్కువగా పడే అవకాశం ఉంది.
- ఇకనైనా జిల్లా బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం రైతులకు పంట రుణాలు పంపిణీ చేయాలని రైతు సంఘాల నేతలు కోరుతున్నారు.

బడ్జెట్‌లో కేటాయించాలి



నాకు మూడెకరాల భూమి ఉండగా, రూ.99,000 రుణం తీసుకున్నా. ఆరు నెలలకు ఒకసారి వడ్డీ చెల్లిస్తూ వస్తున్నా. కానీ రుణమాఫీ ఇప్పటి వరకు జరగలేదు. ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాల్లోనైనా నిధులు కేటాయించి రుణమాఫీ చేసి ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలి.

– కూకట్ల రంజిత్‌కుమార్, సుల్తానాబాద్

రుణాల కోసం పోతే కొర్రీలు..



నాకు ఎకరా పదిగుంటల పొలం ఉంది. జూలపల్లి యూనియర్ బ్యాంకులో రూ.50 వేలు పంట రుణం తీసుకున్న. మాఫీ చేస్తామంటే గత నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నా. బ్యాంకులో అధికార్లను అడిగితే మాఫీ కాలేదు, లోను కట్టమని అంటున్నారు. దీంతో రుణం తీసుకోవడానికి బ్యాంకుకు పోలేని పరిస్థితి. ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలి. – బాలసాని శ్రీనివాస్, అబ్బాపూర్, జూలపల్లి

లక్ష్యం చేరుకుంటాం

లక్ష్యం మేరకు పంట రుణాలు మంజూరు చేయాలని జిల్లాలోని అన్ని బ్యాంకులకు సూచించాం. వానాకాలంలో 32శాతం లక్ష్యాన్ని చేరుకున్నాం. యాసంగిలో నిర్దేశించిన మేరకు లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. అర్హులైన వారందరికీ పంట రుణాలు అందిస్తాం. పంటరుణాల మాఫీపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు. నిధులు వస్తే మాఫీ చేసి రైతుల ఖాతాలో జమ చేస్తాం.

– వెంకటేశ్, లీడ్ బ్యాంక్ అధికారి

సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సహకరిస్తాం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామని ఆర్జీ–1 జీఎం కె.నారాయణ అన్నారు. సింగరేణి ప్రభావిత గ్రామం రామగిరి మండలం ముస్త్యాల గ్రామ ముఖ ద్వారాన్ని మంగళవారం సర్పంచ్ లావణ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సింగరేణి ప్రభావిత గ్రామాల ప్రజలకు తాగునీరు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, మరుగుదొడ్లు వంటి సౌకార్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి అత్యవసర సేవలైనా చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.



గ్రామ ముఖ ద్వారం ప్రారంభిస్తున్న ఆర్జీ–1 జీఎం నారాయణ, సర్పంచ్ లావణ్య

ఇంటింటా కంటివెలుగు

- 18 ఏళ్లు నిండినవారందరికీ కంటి పరీక్షలు
- సమస్యలపై 91776 41042 నంబర్‌కు సమాచారమివ్వొచ్చు
- సర్కార్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం
- పట్టణాల్లో 'బస్తీ' దవాఖానాలు
- పెద్దపల్లికి అర్బన్ పీహెచ్‌సీ మంజూరు
- సబ్‌సెంటర్ల ఆధునికీకరణకు సాగుతున్న పనులు



'సాక్షి'తో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిరూరల్: 'సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బుధవారం లాంఛనంగా ఆరంభమయ్యే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. వారంలో ఐదు రోజులపాటు జరిగే కంటివెలుగు కార్యక్రమంలో ఏమైనా సమస్యలుంటే 91776 41042 సెల్‌నంబర్‌కు నేరుగా సమాచారమందిస్తే సత్వరమే పరిష్కార చర్యలు తీకుంటారు. పెద్దపల్లి పట్టణానికి కొత్తగా అర్బన్ పీహెచ్‌సీ ఏర్పాటుతో పాటు మరో రెండు బస్తీ దవాఖానాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. సర్కార్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించేందుకు ఆసుపత్రులు, సబ్‌సెంటర్లను ఆధునీకరించే పనులు పురోగతిలో ఉన్నాయి' అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. బుధవారం కంటివెలుగుపై ట్రయల్ రన్ నిర్వహించడంతో పాటు జిల్లా ప్రజలకు అందిస్తున్న ఆరోగ్యసేవలు, ఆసుపత్రుల నిర్వహణ తదితర అంశాలపై మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు.

సాక్షి: కంటివెలుగు కార్యక్రమం ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

డీఎంహెచ్‌ఓ: జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు వీలుగా 100 రోజుల్లో.. 387 క్యాంపుల్లో కంటి పరీక్షలు సజావుగా సాగేలా అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రజలకు అనువుగా ఉండేలా కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎంపిక చేశాం.

సాక్షి: ఎంతమందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు?

డీఎంహెచ్‌ఓ: జిల్లాలో 18 ఏళ్లు పైబడ్డవారికే కంటి వెలుగు కార్యక్రమం కింద పరీక్షలు చేస్తున్నాం. 4,97,000 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు రోజూ 120 నుంచి 150మంది వరకు పరీక్షలు చేస్తాం.

సాక్షి: సమస్యలున్నవారికి కంటి అద్దాలు ఎప్పుడందిస్తారు?

డీఎంహెచ్‌ఓ: పరీక్షలు జరిగాక అవసరమైన మందులు, రీడింగ్ గ్లాసులను అప్పటికప్పుడే అందిస్తాం. మిగతా వారికి 15రోజుల్లోగా తెప్పించి అందజేస్తాం.

సాక్షి: పరీక్షలు నిర్వహించేందుకు ఎన్ని టీంలు ఏర్పాటు చేశారు?

డీఎంహెచ్‌ఓ: జిల్లాలో 34 టీంలు, 3 బఫర్ బృందాలు ఏర్పాటు చేశాం. ఒక్కో టీంలో మెడికల్ ఆఫీసర్, ఆప్తాలమిస్టు, డీఈఓ, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు ఆశావర్కర్లు, సూపర్‌వైజర్ ఉంటారు. వాళ్లకు భోజనం, వసతి ఏర్పాట్లు కూడా చేశాం. ఏఆర్ మిషన్, ట్రయల్‌లెన్స్ బాక్సు, మందులు, కళ్ల అద్దాలు, టార్చ్ ఛాట్స్ అందించాం.

సాక్షి: పీహెచ్‌సీల్లో వైద్యసేవలు సరిగ్గా అందడం లేదనే ఫిర్యాదులపై ఏం చర్యలు తీసుకుంటారు?

డీఎంహెచ్‌ఓ: ప్రతీ పీహెచ్‌సీని ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. సిబ్బందితో ఇబ్బందులు ఉన్నట్లు మా దృష్టికి వస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటాం.

సాక్షి: వైద్యశాలల మరమ్మతులకు నిధులొచ్చాయా?

డీఎంహెచ్‌ఓ: మేడారం, కొలనూర్, శ్రీరాంపూర్ పీహెచ్‌సీల కొత్త భవనాలకు రూ.4.68 కోట్లు మంజూరయ్యాయి. మరో 4 పీహెచ్‌సీల మరమ్మతు పనులు కూడా సాగుతున్నాయి.

సాక్షి: పట్టణ ప్రాంతాల్లో కొత్తగా ప్రభుత్వ ఆస్పత్రులు ఏర్పాటు చేశారా?

డీఎంహెచ్‌ఓ: గోదావరిఖనిలో రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేశాం. పెద్దపల్లిలోనూ మొదలవుతాయి. పెద్దపల్లికి మంజూరైన యూపీహెచ్‌సీని అద్దె భవనంలో ఏర్పాటు చేస్తాం.

సాక్షి: సబ్‌సెంటర్ల పరిస్థితి ఎలా ఉంది?

డీఎంహెచ్‌ఓ: జిల్లాలో 104 ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. అవసరమైన వాటికి కొత్త భవనాలు, మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదించాం. కొత్త భవనాలు 29 మంజూరుకాగా 19 పూర్తయ్యాయి.

క్లుప్తంగా

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు హామీ



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో వెంకటమాధవరావు

జ్యోతినగర్(రామగుండం): రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లి ఎస్సీ కాలనీవాసులకు పెండింగ్‌లో ఉన్న ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు ఆర్డీవో వెంకటమాధవరావు హామీ ఇచ్చారు. మంగళవారం మేడిపల్లి ఎస్సీ కాలనీలో స్థానిక కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, గ్రామస్తులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సింగరేణి ఓపెన్‌కాస్ట్–4 వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలని పలు సమస్యలతో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జాహెద్ పాషా, సనపురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కూలీ మృతి



మృతిచెందిన సమ్మయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి అధికారుల క్వార్టర్లలో మరమ్మతులు నిర్వహిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి కూలీ మృతిచెందాడు. మంగళవారం ఆర్జీ–1 ఏరియా విఠల్‌నగర్‌లో సింగరేణి ఎ–1 క్వార్టర్ మరమ్మతులు నిర్వహిస్తున్న క్రమంలో మేషన్ వద్ద కూలీగా పనిచేస్తున్న తొడబోయిన సమ్మయ్య(67) నిచ్చెన పైనుంచి కిందపడగా తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. గోదావరిఖని వన్‌టౌన్ ఎస్‌ఐ స్వామి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..



సతీశ్ (ఫైల్)

రామగిరి(మంథని): మండలంలోని రామయ్యపల్లె గ్రామానికి చెందిన దాడి సతీశ్ చికిత్స పొందుతూ మంగళవారం హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందాడు. గ్రామస్తుల వివరాలు.. సతీశ్‌కు జ్వరం రావడంతో రక్తకణాలు తగ్గిపోయాయి. మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాజేశ్ వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన జి.అరుణ్‌కుమార్ అనే ఇంజినీర్ కొంతకాలంగా కూనారం రోడ్‌లో నివాసముంటున్నాడు. సంక్రాంతి పండగకు భార్యాభర్తలిద్దరూ సొంతూరుకు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు ఇంట్లో చొరబడి తులంన్నర బంగారం, రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లారు. మంగళవారం బాధితులు ఇంటికి రాగా దొంగతనం జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్క్రాప్ బ్యారెల్స్ ముసుగులో ఆయిల్ దందా

- తనిఖీల్లో బయటపడిన మరో 13 ఆయిల్ బ్యారెళ్లు
- దాదాపు 1,820 లీటర్ల ఆయిల్ స్వాధీనం
- లోతుగా సాగుతున్న విజిలెన్స్ విచారణ



పట్టుబడిన వ్యాన్

గోదావరిఖని(రామగుండం): ఖాళీ ఆయిల్ డ్రమ్ముల ముసుగులో ఆయిల్ దందా సాగుతోంది. ఖాళీ డ్రమ్ముల టెండర్ పొందిన కాంట్రాక్టర్ ఆయిల్ ఉన్న డ్రమ్ములను తరలిస్తూ సెక్యూరిటీ చేతికి చిక్కారు. ఈనెల 13న ఈ సంఘటన జరగగా అధికారుల దృష్టికి రావడంతో సీరియస్‌గా తీసుకుని విచారణ చేపట్టారు. డ్రమ్ముల కోసం వచ్చిన నాలుగు వ్యాన్లను అధికారులు సీజ్ చేశారు. మంగళవారం ప్రాజెక్టు అధికారులు, సింగరేణి విజిలెన్స్ అధికారుల పర్యవేక్షణలో వీడియో చిత్రీకరణ ద్వారా అప్పటికే లోడ్ అయిన మిగతా వ్యాన్లలోని డ్రమ్ములను అన్‌లోడ్ చేసి తనిఖీ చేశారు. తనిఖీల్లో మరో 13బ్యారెల్స్‌లో ఆయిల్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆయిల్ బ్యారెల్స్‌ను స్వాధీనం చేసుకుని శాఖాపరంగా, విజిలెన్స్ విచారణ వేర్వేరుగా చేపట్టారు. సుమారు 1,820 లీటర్ల ఆయిల్ స్వాధీనం చేసుకున్నట్లు దీని విలువ రూ.40వేల వరకు ఉంటుందని భావిస్తున్నారు.

ఎన్నాళ్లుగా సాగుతోంది..?

ఖాళీ డ్రమ్ములతో పాటు నిండు ఆయిల్ వ్యాపారం ఎన్నాళ్లుగా సాగుతోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈసంఘటనలో ముగ్గురిని సస్పెండ్ చేసిన యాజమాన్యం కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే ఖాళీ డ్రమ్ముల స్థానంలో నిండు ఆయిల్ డ్రమ్ముల తరలింపు వ్యవహారం ఎన్నాళ్లుగా సాగుతోందనే కోణంలో విజిలెన్స్ అధికారులు లోతుగా విచారణ చేపట్టారు. పూర్తి స్థాయిలో విచారణ తర్వాత సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

బాలికల సమగ్ర వికాసానికి భరోసా

- ఎన్టీపీసీ రామగుండం– తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్





ఈడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న చిన్నారి, కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు

జ్యోతినగర్(రామగుండం): బాలికల సమగ్ర వికాసానికి ఎన్టీపీసీ భరోసా అందిస్తుందని ఎన్టీపీసీ రామగుండం– తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ఉద్యోగ వికాస కేంద్రం మిలీనియం హాలులో బాలికా సాధికారత మిషన్‌లో భాగంగా ఐదు రోజుల పాటు నిర్వహించనున్న సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడారు. సదస్సులో ఉపాధ్యాయులు బోధించిన అంశాలను విద్యార్థులు నేర్చుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను సాధించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం మానివేయాలని, వాడడం వలన కలిగే అనర్థాలపై చర్చించారు. శిక్షణలో భాగంగా డ్యాన్స్, మ్యూజిక్, థియేటర్, యోగా మొదలైన పాఠ్యేతర కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సాధికారత సదస్సు– 2022లో పాల్గొన్న బాలికల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం బాలికలకు ట్రాక్– సూట్‌తో పాటు స్టేషనరీ వస్తువుల కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం(హెచ్‌ఆర్)విజయలక్ష్మి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి భూక్యా సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎస్సై మహేందర్

- బాధిత చిన్నారులకు దుస్తులు, నిత్యవసర వస్తువులు అందజేత



తబిత ఆశ్రమంలో చిన్నారులు

ఓదెల(పెద్దపల్లి): నిత్యం వేధింపులు తాళలేక భర్తను హత్య చేసిన భార్య జైలుకు వెళ్లగా.. అనాథలుగా మారిన పిల్లలకు అండగా నిలిచి మానవత్వం చాటారు పొత్కపల్లి ఎస్సై మహేందర్. మండలంలోని లంబాడితండాలో తాగుడుకు బానిసై వేధించిన గుగులోతు తేజనాయక్‌ను భార్య కవిత ఇటీవల హతమార్చింది. తండ్రి లేక, తల్లి జైలుకు వెళ్లడంతో వారి పిల్లలు గుగులోతు మహేశ్(9), మహాదేవి(8), గిరేందర్(5) అనాథలుగా మారారు. ఘటన సమయంలో ఒంటిమీద ఉన్న బట్టలు తప్ప ఏమీ లేని పిల్లల గురించి వెంటనే ఎస్సై మహేందర్ పెద్దపల్లి బాలరక్షక్ భవన్‌కు సమాచారం అందించారు. బాలరక్షక్ భవన్ నుంచి రామగుండం తబిత స్వచ్ఛంద సంస్థకు తరలించారు. కాగా ముగ్గురు చిన్నారులకు ఎస్సై దుస్తులతో పాటు చద్దర్లు, పుస్తకాలు, నిత్యవసర వస్తువులు అందజేశారు. సదరు పిల్లల బాగోగుల గురించి ఎప్పటికప్పుడు ఫోన్‌లో తెలుసుకుంటున్నారు. ఈసందర్భంగా ఎస్సై ఔదార్యాన్ని లంబాడితండా వాసులు కొనియాడుతున్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): విద్యుత్ బిల్లులతోపాటు అదనంగా వార్షిక వినియోగ డిపాజిట్(ఏసీడీ) పేరిట అదనపు చార్జీలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని రాంనగర్‌లోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మక్కాన్ సింగ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా వసూలు చేస్తున్న ఏసీడీ బిల్లులు పేద ప్రజలు కట్టలేని స్థితిలో ఇబ్బంది పడుతున్నారని, కాబట్టి వెంటనే ఈ విధానాన్ని విరమించుకోవాలన్నారు. లేకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని ప్రకాశ్, గాదం విజయానంద్, బొమ్మక రాజేశ్, చుక్కల శ్రీనివాస్, గంట రమేశ్, దాసరి విజయ్ పాల్గొన్నారు.

గీతకార్మికుడికి గాయాలు

ముత్తారం(మంథని): మండలంలోని పారుపల్లి గ్రామానికి చెందిన గీతకార్మికుడు మంగళవారం సాయంత్రం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముంజాల లింగయ్య రోజూ లాగానే కులవృత్తిలో భాగంగా తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా మోకు జారీ కిందపడ్డాడు. అక్కడే ఉన్న లింగయ్యను తోటి కార్మికులు హుటాహుటిన పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: గ్రూప్స్ పోటీ పరీక్షలకు హాజరయ్యే ఎస్సీ అభ్యర్థులకు మూడు నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సంగీత తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 2,3,4 నోటిఫికేషన్ల ఆధారంగా ఎస్సీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రత్యేక ఫౌండేషన్ ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. డిగ్రీ పూర్తి చేసి, కుటుంబ వార్షికాదాయం రూ.3లక్షలకు మించరాదని, 2022 జనవరి 15 తర్వాత తీసిన ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలన్నారు. డిగ్రీ మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారని వివరించారు. పూర్తి వివరాలకు 97040 11827, 99082 61045 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కాకతీయ మెడికల్ కాలేజీకి శరీర దానం



భగవాన్‌రెడ్డి(ఫైల్)



భగవాన్‌రెడ్డి శరీరం దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి మాజీ ఉద్యోగి, బీఎంఎస్ నాయకుడు కర్ర భగవాన్‌రెడ్డి (65) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. అతడి కోరిక మేరకు తన శరీరాన్ని కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేశారు. ఈసందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, భగవాన్‌రెడ్డి గతంలో సింగరేణి కార్మికుల సమస్యల సాధనలో కీలక పాత్ర పోషించారన్నారు. మరణానంతరం శరీరం మట్టిలో కలిసిపోకుండా మెడికల్ విద్యార్థుల పరీక్షల కోసం దానం చేసి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. భగవాన్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ప్రజాహితం కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇంతటి సత్కార్యానికి సహకరించిన భార్య శారద, కుమారుడు రామచంద్రరెడ్డి, కోడలు హేమ, కుమార్తె స్వప్న, అల్లుడు డాక్టర్ మధుసూదన్‌రెడ్డిలను ఫౌండేషన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, హెడ్ డాక్టర్ పద్మజ, ప్రసూన తదితరులు అభినందించారు.

కారు నంబరు 3911?

- ఏటీఎం దొంగలు ఉపయోగించిన వాహనం
- ఢిల్లీ పాసింగ్ కారుగా గుర్తింపు
- మహారాష్ట్రలో ఉన్నట్లు సమాచారం
- లోతుగా సాగుతున్న పోలీసుల దర్యాప్తు



ఏటీఎం చోరీ సందర్భంగా సీసీ కెమెరాలో కనిపించిన కారు

కోరుట్ల: సంచలనం రేపిన కోరుట్ల ఎస్‌బీఐ ఏటీఎం చోరీ కేసులో దొంగలు ఉపయోగించిన కారును పోలీసులు గుర్తించినట్లు సమాచారం. చోరీ సమయంలో కారును పోలీసు జీపుతో ఢీకొట్టి నగదు స్వాధీనం చేసుకున్నారు. దొంగలు మాత్రం తప్పించుకుపోయారు. పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో ఐదు పోలీసు బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితులు చోరీకి తెగబడకముందు పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కారులో తిరిగినట్లుగా తెలిసింది. ఈ క్రమంలోనే కార్గిల్ చౌరస్తా వద్ద 3911 నంబరు గల కారు అనుమానాస్పదంగా కనిపించింది. చివరకు అదే నంబరు కారులో ముష్కరులు ఏటీఎం చోరీకి వచ్చినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇది ఢిల్లీ పాసింగ్ కారుగా తెలిసింది. ఏటీఎం చోరీ చివరి నిముషంలో పోలీసుల నుంచి తప్పించుకున్న దొంగలు.. మెట్‌పల్లి ఆర్టీసీ బస్ డిపో ఎదురుగా మల్లాపూర్ రూట్‌లో వెళ్లి గోధూర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం మీదుగా నాగ్‌పూర్ జాతీయ రహదారిపైకి వెళ్లి నిర్మల్ ఎదుట ఉన్న సోన్ వంతెన నుంచి ఆదిలాబాద్ చేరుకున్నట్లు సమాచారం. అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఏటీఎం చోరీకి పాల్పడ్డ అగంతకులు కర్ణాటకకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. కారు ఆచూకీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసినట్లు సమాచారం. శనివారం అర్ధరాత్రి దాటాక ఒంటిగంట ప్రాంతంలో ఏటీఎం చోరీ జరిగిన విషయం విదితమే.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి ప్రైవేటీకరణ ప్రమాదకరం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థకు ప్రైవేటీకరణ ముప్పు పొంచి ఉందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం జీడీకే–11గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. బొగ్గుగని కార్మికుల 11వ వేతన ఒప్పందంలో జాతీయ సంఘాల కృషితో పాటు కార్మికుల విజయం ఉందన్నారు. డీపీఈ గైడ్‌లైన్స్ పేరుతో వేజ్ బోర్డు పరిష్కారంలో ఏడు సార్లు సమావేశాలు జరిగినా యాజమాన్యం మొండికేస్తే నాలుగు జాతీయ సంఘాలు కలిసి ఫిబ్రవరిలో బొగ్గు సంస్థల్లో సమ్మెకు పిలుపునిస్తామని హెచ్చరించడంతో సమస్యకు పరిష్కారం దొరికిందన్నారు. ఇతర డిమాండ్లపై త్వరలో జరిగే సమావేశంలో చర్చించి ఒప్పందం చేసుకుందామని కోల్ ఇండియా యాజమాన్యం తెలిపిందన్నారు. వేజ్‌బోర్డు అంగీకారంపై అవగాహన లేని కొన్ని కార్మిక సంఘాలు విమర్శలు చేస్తూ కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వేజ్ బోర్డు ఒప్పందం వల్ల కార్మికుల జీతాల కంటే అధికారుల జీతం తగ్గుతుందని, డీపీఈ గైడ్‌లైన్స్ అమలు చేయాలని కోలిండియాకు అధికారులు లేఖ రాయడాన్ని ఖండించారు. సమావేశంలో నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ రద్దు చేయాలి

రామగిరి(మంథని): సింగరేణిలో బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలనే డిమాండ్‌తో సంస్థ పరిధిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం సెంటనరీకాలనీలోని కేవీఎల్ మహేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకులను ప్రైవేటుపరం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఓసీపీ, అండర్‌గ్రౌండ్‌లలో కాంట్రాక్టీకరణ చేస్తుండడంతో పర్మినెంట్ కార్మికులకు సమానంగా కాంట్రాక్టు కార్మికులు పెరుగుతున్నారన్నారు. అధ్యక్షుడు వై.గట్టయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో యునియన్ నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో మరిన్ని రక్షణ చర్యలు

- డైరెక్టర్ ఈఅండ్‌ఎం సత్యనారాయణరావు



గని ప్లానింగ్ పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

గోదావరిఖని(రామగుండం): భూగర్భ గనుల్లో రక్షణతో కూడిన ఉత్పత్తికి మరిన్ని చర్యలు చేపట్టాలని సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం ఆర్జీ–1 ఏరియాలోని జీడీకే–11గనిని సందర్శించారు. భూగర్భ గనిలో పని స్థలాలు, చేపట్టిన ప్రణాళికల గురించి మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణకు తీసుకుంటున్న చర్యలు తెలుసుకున్నారు. భూగర్భ గనుల్లో ఉత్పత్తి తీస్తున్న క్రమంలో ఎస్‌ఓపీ (సేఫ్ ఆపరేటింగ్ పాసిజర్) తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం మ్యాన్ రైడింగ్ సిస్టమ్, బెల్ట్ కన్వేయర్, యంత్రాల పనితీరును పరిశీలించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ–1 జీఎం కె.నారాయణ, ఏజెంట్ శ్రీనివాస్, ఇంజినీర్ రామ్మూర్తి, గ్రూప్ ఇంజినీర్ రాందాస్, ఫిట్ ఇంజినీర్ రాజబాబు ఉన్నారు.

ఓసీపీ- 3లో రెండు డంపర్లు ఢీ

- కార్మికుడికి గాయాలు



గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధి ఓసీపీ– 3లో సోమవారం రెండో షిఫ్టు ముగింపు సమయంలో రెండు డంపర్లు ఢీకొన్నాయి. ముందుగా వెళ్తున్న డంపర్‌ను వెనకాలే వస్తున్న డంపర్ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ఈపీ ఆపరేటర్ చిట్టంపల్లి ప్రకాశ్‌కు గాయాలయ్యాయి. ఈఘటనపై అధికారులు విచారణ చేపట్టారు. సంఘటనకు దారితీసిన కారణాలపై ఆరా తీస్తున్నారు. ప్రమాదంలో గాయపడిని ఈపీ ఆపరేటర్‌ను గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈసందర్భంగా బాధితుడిని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ధర్మపురి, ఎట్టెం క్రిష్ణ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికులను విస్మరిస్తున్న సంఘాలు



మాట్లాడుతున్న శ్రీనివాస్

గోదావరిఖని(రామగుండం): పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను కార్మిక సంఘాలు, యజమాన్యం విస్మరిస్తోందని ఐఎఫ్‌టీయూ నేత టి.శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత, రిజర్వేషన్లు, ఇతర హక్కులు లేకుండా పోతున్నాయన్నారు. కాంట్రాక్టు కార్మికుడి శ్రమదోపిడీతో పాటు ఇవ్వాల్సిన వేతనాల్ని మిగిల్చుకుని పర్మినెంట్ కార్మికులకు లాభాల వాటా ఇస్తున్నారన్నారు. ప్రైవేట్ రంగానికన్నా ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి అధ్వానంగా తయారైందని, కాంట్రాక్టు కార్మికులు సింగరేణిలో గణనీయంగా పెరిగిపోయాయన్నారు. ఇదే క్రమంలో పర్మినెంట్ కార్మికులు ఏటా తగ్గిపోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యల సాధనకు ఈనెల 27న కొత్తగూడెంలో 7వ మహాసభ నిర్వహిస్తామని తెలిపారు. దీనికి పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్-6 కెనాల్‌కు మరమ్మతులు చేపట్టండి

- ఆర్జీ–3 జీఎంకు మంథని ఎమ్మెల్యే లేఖ

మంథని: డివిజన్ పరిధిలోని రాజాపూర్ నుంచి మంథని వరకు ఉన్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ఎల్–6 కెనాల్ మరమ్మతులు చేపట్టి రైతుల పొలాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు ఆర్జీ–3 జీఎంకు లేఖ రాశారు. సింగరేణి సంస్థ మట్టి డంపింగ్ వల్ల కెనాల్ పూర్తిగా మట్టితో నిండి కాలువ గుండా సాగునీరు రాని పరిస్థితి నెలకొందని లేఖలో పేర్కొన్నారు. దీంతో కన్నాల, పందులపల్లి, ఉప్పట్ల, పోతారం, విలోచవరం, మల్లెపల్లి, గుంజపడుగు, సిరిపురం తదితర గ్రామాల్లో సుమారు నాలుగు వేల ఎకరాలకు సాగునీరు రావడం లేదని, వెంటనే కెనాల్‌లోని షిల్ట్ తొలగించి రైతులకు సౌకర్యంగా నీరు అందేలా చూడాలన్నారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన సంక్రాంతి



సుల్తానాబాద్/మంథని: సంక్రాంతి పండగ ఆర్టీసీకి కలిసొచ్చిందని చెప్పవచ్చు. ఈనెల 14 నుంచి 16 వరకు జిల్లా పరిధిలో 3 నియోజకవర్గాలు, 2 డిపోల నుంచి పలు ప్రాంతాలకు 174 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడిపింది. మొత్తం లక్షా 90 వేల కిలోమీటర్లు తిరగగా రూ.73.48 లక్షల ఆదాయం సమకూరినట్లు గోదావరిఖని డిపో మేనేజర్ మల్లేశం తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సరాసరి రూ.20లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

అధికారుల పర్యవేక్షణలో..

జిల్లా పరిధిలోని గోదావరిఖని డిపో నుంచి 115, మంథని డిపో నుంచి 59 బస్సులు నడిపించారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని బస్టాండుల్లోనే ఉంటూ రద్దీ ఉన్న ప్రాంతాలను గుర్తిస్తూ అందుకు తగ్గట్టుగా బస్సులు ఏర్పాటు చేయడంతో ఆదాయం సమకూరింది. పండగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు ఎక్కువగా హైదరాబాద్ నుంచి పెద్దపల్లి, సుల్తానాబాద్, గోదావరిఖని, మంథని ప్రాంతాలకు ప్రయాణికులను చేర్చాయని అధికారులు తెలిపారు. రీజనల్ ఆపరేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రవిచందర్‌రాజు ప్రత్యేకంగా పర్యవేక్షించారు.